ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 12 ఆగస్టు 2024

ఆలయాల్లో శ్రావణ సందడి
- వేములవాడలో కోడె మొక్కుకు మూడు గంటల సమయం
5లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి
5లో..

పాండవుల గుట్ట.. యథేచ్ఛగా కబ్జా

- నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలు..
- పట్టించుకోని ఉన్నతాధికారులు


కబ్జాకు గురవుతున్న పాండవుల గుట్ట ప్రాంతం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 11: మండల కేంద్రంలోని పాండవుల గుట్ట కబ్జాకు గురవుతోంది. గతంలో నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో 597 సర్వే నంబర్‌గల పాండవుల గుట్ట విస్తీర్ణ సుమారు 180ఎకరాల వరకు ఉం టుంది. మండల కేంద్రంలో ఎక్కడా ప్రభు త్వ భూములు లేకపోవడంతో పాండవుల గుట్ట భూమిపైనే ఆధారపడి ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయాలు నిర్మించారు. ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్‌స్టేషన్, రైతు వేదిక, విద్యుత్ సబ్‌స్టేషన్, వ్యవసాయ మార్కెట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా బాలికల పాఠశాల, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వ నిర్మించారు. నలభై సంవత్సరాల క్రితం ఈ గుట్ట ప్రాంతంలో జగత్ మహామునేశ్వరస్వామి ఆలయం, వేద పాఠశాలకు సుమారు 18ఎకరాల వరకు ప్రభుత్వం భూమి కేటాయించింది. సుమారు ఇంకా 100 ఎకరాల వరకు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఉండగా గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎకరాలకు ఎకరాలు పట్టాలిచ్చారనే ఆరోపణలున్నాయి. ఈ భూమి పట్టాలను వ్యవసాయ భూములు ఉన్నవాళ్లకు, ధనవంతులకు అక్రమంగా రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చినట్లు గ్రామస్తులు ఆరోపి స్తున్నారు. మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్లలోపు ఎవరికి కూడా ప్రభుత్వ భూమి పట్టాలివ్వకూడదని నిబంధనలు ఉన్నా రెవెన్యూ అధికారులు ఆ నిబంధనలు తుంగలో తొక్కి పట్టాలిచ్చినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు వాళ్ల కార్యాలయంలో పనిచేసిన వారికి కూడా పట్టాలిచ్చినట్టు సమాచారం.

మంథని, భూపాలపల్లికి వెళ్లే రహదారి పక్కన ఈ పాండవుల గుట్ట ఉండడంతో పట్టా భూములకు ఎకరానికి రూ.40లక్షలు పలుకుతోంది. దీంతో ఈ గుట్ట ప్రాంతాన్ని కబ్జా చేసుకున్న వారి భూములకు లక్షల్లో డిమాండ్ పెరిగింది. కాల్వశ్రీరాంపూర్ ప్రాంతానికి కాకుండా చుట్టుపక్కల వారికి కూడా ఈ గుట్టప్రాంతంలో వ్యవసాయ భూములు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టా చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాండవుల గుట్ట కబ్జా అవుతుందని ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన కబ్జాలు ఆగడం లేదని పలువురు పేర్కొంటున్నారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన భూములను రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా పట్టాలిచ్చారని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాదిగ సంఘాల సదస్సుకు తరలిన నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11: తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ హైదరాబాద్‌లో బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించనున్న మాదిగ సంఘాల సదస్సుకు ఆదివారం జిల్లా నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. మాదిగ శక్తి వ్యవస్థాప అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి ఆధ్వర్యంలో 20 మంది మాదిగ శక్తి కార్యకర్తల బృందం జగ్జీవన్ రామ్ భవన్ సదస్సుకు హాజరయ్యారు.

హైదారాబాద్ వెళ్లిన వారిలో పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్లపల్లి అంజయ్య, కొమ్ము జగదీష్, మడిపల్లి మొగిలి, మైస అశోక్, ఆశం శంకర్, బొంద్యాల రాజు, రామిళ్ళ మైసయ్య, గొల్లపల్లి రమేష్, శనిగరం వెంకటేష్, కన్నూరి సతీష్, చాట్ల రమేష్, కుక్క మల్లేశం తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11: లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయత్రీ విద్యాసంస్థల అధినేత లయన్ అల్లంకి శ్రీనివాస్ ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో నెలకు సరిపడా బియ్యం కిరాణసామగ్రితో పాటు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 200మందికి అన్నప్రసాదన వితరణ నిర్వహించారు. మంగపేట గ్రామానికి చెందిన కావ్య అనే దివ్యాంగురాలికి మెడికల్ అవసరాల నిమిత్తం మూడు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వేల్పూరి సంపత్‌రావు, కంకటి శ్రీనివాస్, బెల్లంకొండ జైపాల్‌రెడ్డి, చంద్రగిరి వంశీ రాజ్, లైశెట్టి బిక్షపతి, పిట్ట వెంకటేష్, సయ్యద్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

జూలపల్లి, ఆగష్టు 11 : మండలంలోని తెలుకుంట గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఉత్సాహభరితంగా జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అందరు ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయులను వేదికపైన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయండి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ పిలుపునిచ్చారు. ఆదివారం 9వ డివిజన్ జనగామ గ్రామంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనగామ శివరామకృష్ణ ఆధ్వర్యంలో జనగామలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 13, 14 తేదీల్లో ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి రవీందర్, జక్కుల నరహరి, సుల్వ లక్ష్మీనర్సయ్య, శివ కుమార్, సునీల్, శంకర్, సురేందర్, సుధీర్, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నుంచి పడి మృతిచెందిన కార్మికుడు గణేష్ కుటుంబానికి న్యాయం చేయాలని, కాంట్రాక్టర్‌పై హత్య కేసు నమోదు చేయాలని సీపీఐ నాయకుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనంలో లిఫ్ట్ నిర్మాణం కోసం తీసిన గొయ్యిలో పడి సెంట్రింగ్ కార్మికుడు గణేష్ మృతిచెందాడని, రెండు నెలల క్రితం కూడా రావుల విజయ్ అనే యువకుడు కూడా గోయ్యిలో పడి మృతిచెందాడని, కాంట్రాక్టర్ ఎలాంటి సేఫ్టీ లేకుండా పనులు నిర్వహిస్తున్నాడని, మృతదేహాలను గోప్యంగా వారి గ్రామాలకు తరలిస్తున్నారని, గతంలో కూడా మెడికల్ కళాశాలలో ముగ్గురు నిర్మాణ పనులు చేస్తూ మృతిచెందారన్నారు. గణేష్ కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించి కాంట్రాక్టర్‌పై హత్య చేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆండాలమ్మ ఆలయంలో పరుచుకున్న పచ్చదనం


ఆలయం అవరణలో ఉన్న పూలమొక్కలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 11 : పెద్దపల్లి మండలంలోని ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆండాలమ్మ ఆలయం ఆకర్షణీయంగా మారింది. కొన్నేళ్ల క్రితం నాటి పురాతన ఆలయం చుట్టూ పంచాయతీ అధికారులు మొక్కలు నాటడంతో పచ్చదనం పురుచుకుంది. దీంతో చూపరులను ఆకట్టుకునే విధంగా మారింది. ఈ అలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

సుల్తానాబాద్‌లో ఇంటింటా జ్వర పీడితులు


ఓపీ కౌంటరు వద్ద బారులుతీరిన జ్వర పీడితులు

సుల్తానాబాద్, ఆగస్టు 11: సుల్తానాబాద్‌తో పాటు పలు గ్రామాలలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. నెల రోజుల నుంచి మండలంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇంకా జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. మరోవైపు రోజుల తరబడి కీళ్ల నొప్పులతో సతమతమవుతున్నామని బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో జ్వరాలు తగ్గినా తద్వార వచ్చిన నొప్పులు మాత్రం తగ్గడం లేదని కనీసం లేచి కూర్చోవడం, నడవడం కూడా చాతకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి గతకొన్ని రోజులుగా జ్వర పీడితులతో కిక్కిరిసిపోతోంది. జ్వరాలు వచ్చిన పేద వారు వందల సంఖ్యలో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. ఉదయం నుంచి ఓపీ విభాగంలో పెద్దఎత్తున రోగులు చీటీల కోసం ఎదురుచూస్తున్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు ఉన్నా సరైన సేవలు రోగులకు అందడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్న వారితో ప్రభుత్వ ఆసుపత్రిలోని పడకలు మొత్తం నిండిపోయాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కళాకారులకు 'నల్లవజ్రం' పురస్కారాల అందజేత


కళోత్సవాలలో కళాకారుల నృత్యప్రదర్శన..

జ్యోతినగర్, ఆగస్టు 11: గోదావరిఖనిలోని తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ ఈడీసీ ఆడిటోరియంలో జాతీయ స్థాయి కళోత్సవాలు రెండవ రోజు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరై వారి కళా ప్రదర్శనలతో అలరిస్తున్నారు. హైదరాబాద్, రాజమండ్రి, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలతో పాటు రామగుండం, గోదావరిఖనికి చెందిన కళాకారులు కూచిపూడి నృత్యాలు, పేరిణి నృత్యాలు, గీతాలు, జానపద గీతాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా హాజరైన అతిథులు మాట్లాడుతూ తారా ఆర్ట్స్ అకాడమీ జాతీయస్థాయిలో కళోత్సవాలు నిర్వహించడంపై నిర్వాహకులు సంకె రాజేష్‌ను అభినందించారు. అనంతరం సింగరేణి వ్యాప్తంగా ప్రతిభ కలిగిన కళాకారులు, క్రీడాకారులు, వివిధ రంగాలలో రాణిస్తున్న వారిని గుర్తించి నల్లవజ్రం పురస్కారాలతో సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, తారా ఆర్ట్స్ వ్యవస్థాప కులు సంకె రాజేష్, మేకల శ్రీధర్‌యాదవ్, టీవీ నటీనటులు గోపాల స్వామి, ప్రణయ్ కుమార్, లోహిత్‌కుమార్, లిరీష్, చరిష్మా, సోహెల్, నిర్వహణ కమిటీ సభ్యులు కె స్వామి, మేజిక్ రాజా, దయానర్సింగ్, దామెర శంకర్, చల్లా ప్రవీణ్, నర్సయ్య, తిరుమల్, చీకటి అంజయ్య, సుంకె రాజు, డాక్టర్ సాయితో పాటు కళాకారులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఉరుములుమెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జీడీకే 11 ఇంక్లైన్‌పై పిడుగు పడడంతో ఓ చెట్టు మాడిపోయింది. ఆ సమయంలో అక్కడ కార్మికులెవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. గని ముఖ ద్వారం వద్ద ఉన్న చెట్టుపై పిడుగుపడడంతో చెట్టు కాలిపోయింది. తెల్లవారుజామున 3 సెంటీమీటర్ల వర్షం నమోదు అయ్యింది. మూడు గంటల పాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ధర్మారంలో..

ధర్మారం, జూలై 11: ధర్మారంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము 3గంటలకు వర్షం మొదలై ఉదయం 8గంటల వరకు కురిసింది. వర్షం కారణంగా రోడ్లన్నీ బురదమయమై ప్రజలు కాలినడకకు కూడా ఇబ్బందిపడ్డారు. ఇటీవల నాటువేసిన పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. అదే విధంగా ఈ వర్షంతో చెరువు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. దీంతో అన్నదాతలు ఆనందంతో పంటల సాగుకు మొగ్గు చూపారు. ఈసారి ఆశించిన స్థాయిలో వర్షం కురవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీహెచ్‌పీ కరీంనగర్ విభాగ్ కార్యదర్శిగా అయోధ్య రవీందర్


అయోధ్య రవీందర్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: వీహెచ్‌పీ కరీంనగర్ విభాగ్ కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన అయోధ్య రవీందర్‌ను నియమించారు. రెండు రోజులుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విశ్వహిందు పరిషత్ సమావేశంలో అయోధ్య రవీందర్ కరీంనగర్ విభాగ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కరీంనగర్, వేములవాడ సిరిసిల్లా, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు బాధ్యునిగా వ్యవహరించనున్నారు. వీహెచ్‌పీ కరీంనగర్ విభాగ్ కార్యదర్శిగా అయోధ్య రవీందర్‌ను నియమించడం పట్ల వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రామగిరి ఎస్ఐగా చంద్రకుమార్

రామగిరి, ఆగస్టు 11: రామగిరి ఎస్ఐగా చంద్రకుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సందీప్‌కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ కాగా, ఆయన స్థానంలో చంద్రకుమార్ బాధ్యతలు చేపట్టారు.

ముత్తారం ఎస్ఐగా గొపతి నరేష్

ముత్తారం, ఆగస్టు 11: ముత్తారం ఎస్ఐగా గొపతి నరేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముత్తారం ఎస్ఐ పనిచేసిన మధుసూదన్‌రావు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన గొపతి నరేష్ ముత్తారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

ఓదెల, ఆగస్టు 11 : మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజయ్య ఇటీవల మృతిచెందగా ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కనికి రెడ్డి సతీష్ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భోగె సదానందం గడ్డం శ్యామ్, రాచర్ల కిషన్, సతీష్, రాజు, మహేష్, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మహేందర్


మహేందర్

ఎలిగేడు, ఆగస్టు 11 : మండలం నారాయణపల్లి(కట్టకిందిపల్లి)కి చెందిన కాసార్ల మహేందర్‌ను తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నా రమేష్, జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఎలిగేడు మండల కేంద్రంలో సమావేశమై బీసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. తనపై నమ్మకంతో నాకు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మండల బాధ్యతలు అప్పగించిన వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలపారు.

గోమాత పుట్టిన రోజు వేడుకలు

సుల్తానాబాద్, ఆగస్టు 11: సుల్తానాబాద్ మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ ఐల రమేష్ దంపతులు తాము పెంచుకుంటున్న గోమాత పుట్టిన రోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. రెండేళ్ల క్రితం స్థానిక గోశాల నుంచి గోవును తీసుకువచ్చి పెంచుకుంటున్నారు. సర్వ దేవతలు కొలువు ఉన్న గోమాతను తాము తమ ఇంటి ఆడపడుచుగా భావించి లక్ష్మీ అనే నామకరణం చేసి ఎంతో భక్తి శ్రద్ధలతో పెంచుకుంటున్నామని, రెండేళ్లు కావస్తున్న తరుణంలో ఆదివారం రెండో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించామని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్లు, పెద్దలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

రూఫ్ లీకేజీలతో కార్మిక కుటుంబాలు సతమతం


సెంటినరీకాలనీలోని క్వార్టర్స్(ఫైల్)

రామగిరి, ఆగస్టు 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ క్వార్టర్స్ రూఫ్ లీకేజీలతో కార్మిక కుటుంబాలు సతమతం అవుతున్నారు. చినుక పడితే చాలు క్వార్టర్స్ రూఫ్ నుంచి ఉరుపులతో క్వార్టర్స్ తడిసిపోతున్నాయి. ఇంట్లో గృహోపకరణలు, నిత్యావసర వస్తువులు వర్షం నీటిలో తడిసిపోతున్నాయి. ప్రతి వర్షం కాలంలో ఇదే పరిస్థితి నెలకొన్న సింగరేణి యాజమాన్యం పట్టింపు ధోరణి కనిపించడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజన్‌కు ముందు క్వార్టర్స్ మరమ్మతులు చేపట్టాల్సిన యాజమాన్యం తీరా సమయానికి మరమ్మతులు చేపట్టడంతో పుణ్యకాలం గడిచి పోతుందని కార్మికుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విధులకు హాజరై తిరిగి వచ్చిన కార్మికులు రూఫ్ లీకేజ్‌ల కారణంగా నిద్రలేక నరకం చూస్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి యుద్ధ ప్రతిపాదికన క్వార్టర్స్ రూఫ్ లీకేజీలను అరికట్టాలని కార్మిక కుటుంబా లు కోరుతున్నాయి.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి కొప్పుల పరామర్శ


బీఆర్ఎస్ కార్యకర్త చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్

జూలపల్లి, ఆగస్టు 11: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రేచవేని శ్రీనివాస్ అనే బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ రేచవేని రాధ భర్త అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా మృతుడి కుటుంబసభ్యులను ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్‌లు పరామర్శించారు. మృతికి గల కారణా లను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. కాగా, పరామర్శించిన వారిలో పలువురు బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు ఉన్నారు.

ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా వెంకటరమణ

రామగిరి, ఆగస్టు 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారిగా సీఎంవోఏ అధ్యక్షుడు వెంకటరమణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ రామారావు, అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగరాజు, నాగేశ్వర్‌రావు, కోల శ్రీనివాస్, జీఎల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ రజక సంఘం అధ్యక్షుడిగా రాజేశం

సుల్తానాబాద్, ఆగస్టు 11: సుల్తానాబాద్ పట్టణ రజక సంఘం నూతన అధ్యక్షుడిగా నిట్టూరి రాజేశం ఎన్నికయినట్టు మండల రజక సంఘం అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాజేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. కాగా, నూతనంగా పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికయిన రాజేశంను మండల పట్టణ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, నిట్టూరి అంజయ్య, కొత్తకొండ శ్రీనివాస్,మైసయ్య, మధునయ్య, సంతోష్, స్వామి, చాతల శివ, అనిల్, గణేష్, రాజు, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 11: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంటిలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.6900 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో ఇంటి యజమాని పేకాటరాయుళ్లకు ఇల్లు అద్దెకు ఇచ్చి పేకాట ఆడిస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలు

శంకరపట్నం, ఆగస్టు 11: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కర్ర లోడుతో వెళ్తున్న లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుంది. వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కర్ర లోడుతో ఉన్న లారీ కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలో ఢీకొనడంతో లారీలో ఉన్న కర్రలు బస్సు అద్దాలకు తగలడంతో పగిలి పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ నాయక్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 11: గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన బాదవత్ భాస్కర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఏబీఎస్ఎస్ కార్యాలయంలో గిరిజన విద్యా సంఘం జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ఏర్పాటు సమావేశంలో ఆయ నను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఎన్నిక పట్ల గిరిజన విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, ఆగస్టు 11: మండలంలోని మద్దుట్లలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ సంఘటనలో 15తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. మల్యాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సామల దేవయ్య అనే వ్యక్తి నెల రోజుల క్రితం మల్యాలలోని కూతురు ఇంటికి వచ్చి ఉంటున్నారు. గురువారం దేవయ్య మద్దుట్లకు వెళ్లి రాగా ఆదివారం కూడా మరోసారి వెళ్లాడు. ఇంటి తాళం తీసి ఉండడంతో అనుమానం వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. బంగారం కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ సంఘటన స్థలం పరిశీలించారు. జాగిలాలు, క్లూస్ బృందాలతో గాలింపు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ, ఎస్సై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణంలో ప్రమాదం

● కాగజ్‌నగర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడి మృతి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఎమర్జెన్సీ యూనిట్ భవన నిర్మాణంలో శనివారం రాత్రి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు వాగడి గణేష్ (26) మృతి చెందాడు. శనివారం రాత్రి సెంట్రింగ్ పనిచేసి భోజనం తరువాత సెంట్రింగ్ జరిగిన చోటే తోటి కార్మికులతో కలిసి పడుకున్నాడు. పైన దోమలు ఉన్నాయంటూ మిగతా కార్మికులు కిందకు దిగారు. కానీ గణేష్ అక్కడే పడుకున్నాడు. ఆదివారం జామున వర్షం పడుతుండంతో కిందకు దిగే క్రమంలో జారి లిఫ్ట్ కోసం తవ్విన గొయ్యిలో పడిపోయాడు. అందులో నీరు ఉండడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.6.5లక్షల నష్టపరిహారం చెల్లించినట్టు సమాచారం. గణేష్ సోదరుడు చందు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వేములవాడలో పోటెత్తిన భక్తులు

ఆలయాల్లో శ్రావణ సందడి

● వేములవాడలో కోడె మొక్కుకు మూడు గంటల సమయం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణం మాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ కల్యాణ మండపంలో తలనీలాలు సమర్పించిన భక్తులు, ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ఉదయం 10.15 గంటలకు బ్రేక్ దర్శనం అమలు కావడంతో టికెట్స్‌కు కోసం భక్తులు బారులు తీరారు. గంటల సమయంలో సుమారుగా 450 టికెట్స్ ఇచ్చారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా మూడు గంటల పాటు నిరీక్షించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజన్న ఆలయానికి ఆదివారం 30 వేల మంది భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు. భక్తుల తాకిడి పెరగడంతో ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. అన్నదాన సత్రంలో భక్తులను కలిసి భోజనం నాణ్యతపైన ఆరా తీశారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, అల్లి శంకర్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

కొండగట్టులో ముగిసిన శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలు ఆదివారంతో ముగి శాయి. చివరిరోజు ఆంజనేయస్వామికి 108 అష్టోత్తర శతకళశాభిషేకం, సహస్రనామ అర్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి, అమ్మవారికి అభిషేకార్చన, సహస్రనామ కుంకుమార్చనతో పాటు ఒడిబియ్యం సమర్పించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ వేదపండితులు రమేష్‌శర్మ, సా మవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


కొండగట్టులో అష్టోత్తర శతకళశాభిషేకం చేస్తున్న అర్చకులు


ధర్మపురి గోదావరి వద్ద భక్తులు


ధర్మపురి ఆలయంలో..

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాలయాల కార్యదర్శి రమణకుమార్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రెసిడెన్షియల్ విద్యాలయల కార్యదర్శి రమణకుమార్ ఆదేశించారు. ఆదివారం గురుకుల పాఠశాలను డీఈ యూసీఫ్‌తో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో మృతి చెందిన విద్యార్థుల వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజుల వ్యవధిలో గురుకుల పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు అనుమానస్పదంగా మృతి చెందడం, మరో నలుగురు అస్వస్థతకు గురికావడం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించిందన్నారు. పాఠశాలలో చేస్తున్న పనులను పరిశీలించి, ఇంకా అవసరమైన వాటి గురించి నివేదిక ఇవ్వాలని నిర్వహకులకు సూచించారు. పనులు చేస్తున్న అధికారులు, నిర్వాహకులకు సూచనలు చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గురుకులంలో అధికారులు, నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, గదులు, స్నానపు గదులు, కిటికీలు ఏర్పాటు, దోమలు, విషపు కిటకాలు కుట్టకుండా ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు, పాడు భవనాలను కూల్చివేయాలని, పారిశుధ్యం పనులను చేపట్టాలన్నారు. నూతన భవనంలో కరెంట్, ఫ్లబింగ్ ఏర్పాటు, గదులలో అస్తవ్యస్తంగా ఉన్న కిటికీలకు మరమ్మతులు చేయించాలన్నారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు మొండి మోక్షిత్, హేమంత్‌ల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇరువురి విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారు కోలుకుంటున్నట్లు నిజామాబాద్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విద్య సాగర్, షైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్య దర్శులు, ఆసీఫ్, అశోక్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దాపూర్ గురుకులంను పరిశీలిస్తున్న టీజీఆర్ఎస్ కార్యదర్శి రమణకుమార్

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 11: ఇల్లందకుంట మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లోకిని రాజేష్ అనే వ్యక్తి పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇల్లందకుంట ప్రధాన కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 25క్వింటాళ్ల బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

చెంజర్లలో 10 క్వింటాళ్ల బియ్యం..

మానకొండూర్ : మండలంలోని చెంజర్ల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన దరావత్ నర్సింహ శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో నివసిస్తున్నాడు. ప్రతి రోజు తన ఆటోలో గ్రామాలలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తుంటాడు.

అందులో భాగంగా ఆదివారం 10క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, అగస్టు 11: రాష్ట్రంలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలోపు ఎస్‌జీటీలకు ఓటు హక్కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఆదివారం టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌జీటీలపైన వివక్ష చూపడం సరైందికాదని వారి సమస్యలు అందరూ పట్టించుకోవాలంటే ముందుగా వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలన్నారు. అలాగే 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేస్తూ వారిని స్థానిక ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దుకు సహకరిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్ని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి డీఈడీతోపాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టును వెంటనే తెప్పించి అమలు చేయాలన్నారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తిచేసి 010 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు ఎస్ఎస్ఏ సిబ్బందికి కనీస మూల వేతనం చెల్లించాలని, కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు 27 సెలవులు మంజూరు చేయాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని 010 ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రామ్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పూరెల్లి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, జిల్లా కార్యదర్శులు శ్రీధర్, డబ్బెడ హన్మాండ్లు, నాయకులు మైలారం తిరుపతి, బోజ్జ కృష్ణ, దేవేందర్, ఉపేందర్, మధుసూదన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

టీజీఎన్పీడీసీఎల్‌లో అధికారులకు ర్యాంకులు

● డిస్కం స్థాయిలో ఎస్ఈ గంగాధర్‌కు, కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజుకు ప్రథమ ర్యాంకులు


ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 11: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) సీఎండీ కె.వరుణ్‌రెడ్డి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులకు వారి పని తీరును బట్టి ర్యాంకింగ్స్ ఇచ్చారు. ఎన్పీడీసీఎల్ స్థాయిలో కరీంనగర్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రథమ ర్యాంకు, డివిజనల్ స్థాయిలో కరీంనగర్ డీఈ జె.రాజం ప్రథమ ర్యాంకు సాధించారు. కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ప్రథమ ర్యాంకు, టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్, బొమ్మకల్ ఏఈ తిరుపతికి ప్రథమ ర్యాంకు, నజియాబేగంలు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన అధికారులను విద్యుత్ శాఖ సిబ్బంది అభినందించారు.


రూరల్ ఏడీఈ, కొలుపుల రాజు

రెచ్చగొట్టి దోచుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మృత్యుంజయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: తెలంగాణ మలి దశ ఉద్యమం నాటి నుంచి గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సామాన్యులను రెచ్చగొట్టి దోచుకోవడమే పనిగా పెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతోందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలనను సాగిస్తోందని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కొన్ని సాంకేతిక లోపాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ వర్తించలేదని, అలాంటి రైతులు అధైర్యపడవద్దని అన్నారు. వివరాలను సరిచేసి మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడులను ఆకర్షించేందుకు విదేశాల్లో పర్యటిస్తుంటే ఆయన అక్కడే పోటీ చేస్తారేమోనని ప్రతి పక్ష పార్టీ ప్రజాప్రతినిధి పేర్కొనడం సిగ్గు చేటని అన్నారు. పెట్టుబడులతో పాటు పరిశ్రమలను తెలంగాణలో ఏర్పాటు చేసి నిరుద్యోగుల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అన్నారు. ఉద్యమ సమయంలో యువతను రెచ్చగొట్టి ప్రాణాలను బలితీసుకున్న బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా ఆ కుటుంబాలను ఆదుకోకపోవడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ అరాచకాలను సహించలేని తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజలు ఛీదరించుకున్నా బీఆర్ఎస్ నేతల బుద్ధి మారలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతోందని మృత్యుంజయం అన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాములు, కృష్ణమూర్తి, తిరుపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయం

విద్యుదాఘాతంతో యువతి మృతి

కోరుట్ల, ఆగస్టు 11 : కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్డుకు చెందిన యువతి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన కోరుట్లలో విషాదం నింపింది. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ రోడ్డుకు చెందిన చిలుముల రాధాకృష్ణ-భూమక్క దంపతులకు ముగ్గురు కుమారులు, కూతురు అరుణ (25) ఉన్నారు. అరుణ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాదులోని ఎల్‌బీనగర్‌లో మూడేళ్ల నుంచి ఒక ట్రావెల్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం సమయంలో ట్రావెల్‌కు ఉన్న బోర్డును సవరిస్తుండగా పక్కన ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయినట్లు బంధువులకు అక్కడ ఉన్న వారు సమాచారం అందించారు. ట్రావెల్ వారు చికిత్స నిమిత్తం అరుణను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు హైదరాబాద్‌కు వెళ్లి అరుణ మృతిపై అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం రాత్రి సమయంలో అరుణ మృతదేహం కోరుట్ల పట్టణానికి చేరుకుంది. కూతురు మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.


అరుణ(ఫైల్)

కౌన్సిలర్‌పై కేసు నమోదు

కోరుట్ల, ఆగస్టు 11: పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ మ్యాడవేణి నరేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. నరేష్ సామాజిక మాధ్యమంలో అస్యభకరమైన పోస్టు చేశాడు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నం చేస్తున్నాడన్న ఉద్దేశం పోస్టులో ఉండడంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ సురేష్ బాబు పర్యవేక్షణలో సుమోటో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ బస్టాండు సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం మర్తన్నపేటకు చెందిన వృద్ధుడు సూర బుచ్చయ్య(65) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. కోనరావుపేట మండలం మర్తన్నపేటలోని బుచ్చయ్య తన వాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్నాడు. హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన నాంపల్లి నర్సింలు గ్రామ శివారులోని ఓ టీస్టాల్ వద్ద టీ తాగి తన వాహనంపై ఎదురుగా వెళుతున్నాడు. ఒక్కసారిగా వాహనాన్ని తన ఇంటి వైపునకు మళ్లించడంతో అటు వైపు నుంచి వస్తున్న బుచ్చయ్య వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన సూర బుచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లవ్వ, నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

చెరువు తూము తీయడానికి వెళ్లి రైతు మృతి

ఎలిగేడు, ఆగస్టు 11: మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో పెద్దచెరువు తూము తీయడానికి వెళ్లి పూసాల గ్రామానికి చెందిన కంకణాల కొంరయ్య(50) మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఉస్తెం స్వామితో కలిసి కొంరయ్య ఇద్దరు వ్యవసాయ పనుల నిమిత్తం సాగునీటి కొరకు పెద్దచెరువు వద్దకు వెళ్లి తూము దగ్గర ఉన్న చెత్తాచెదారం తీసే క్రమంలో కొంరయ్య నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి తూములో ఇరుక్కొని మృతిచెందాడు. మృతుడి భార్య కంకణాల స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

రిపేర్‌కు ఇచ్చిన ఫోన్ ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం

జగిత్యాలరూరల్, ఆగస్టు 11 : జగిత్యాల పట్టణంలోని ఓ సెల్‌పాయింట్‌లో రిపేర్‌కోసం ఇచ్చిన సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని కోరుట్ల మండలం చిన్న మెట్‌పెల్లి చెందిన రమేష్ అనే వ్యక్తి జగిత్యాల బస్టాండ్‌లో బ్లేడ్‌తో చేయికోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు రమేష్ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. జగిత్యాలలోని ఓ సెల్‌పాయింట్‌లో మూడు రోజుల క్రితం తన సెల్‌ను రిపేరు నిమిత్తం ఇచ్చాడు. మూడు రోజులు గడిచినా ఫోన్ ఇవ్వడం లేదని మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో రమేష్ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రమేష్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన ప్రయాణికులు వెంటనే 108కు ఫోన్‌చేసి సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకొని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి

కోల్‌సిటీ, ఆగస్టు 11: గోదావరిఖని గంగానగర్ వద్ద శనివారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవాదత్ నాయక్(28), సత్యేంద్ర నాయక్(19) మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉత్తరప్రదేశ్ అలీఘడ్‌కు చెందిన వీరు మంచిర్యాలలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ముందు మెహందీ వేస్తూ జీవిస్తున్నారు. కోల్‌బెల్ట్‌లోని పెళ్లిళ్లకు, ఇతర వేడుకలకు మెహందీ వేస్తారు. శనివారం రాత్రి ఖైటింక్లయిన్‌కాలనీలోని ఒక వివాహ వేడుకలకు మెహందీ వేసి తిరిగి మోటార్ సైకిల్‌పై మంచిర్యాలకు వెళుతుండగా గంగానగర్ వద్ద రాజీవ్ రహదారిపై కంటైనర్ అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వాహనాన్ని బసంత్‌నగర్ టోల్‌గేట్ సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ సృజన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.



సత్యేంద్రనాయక్, దేవాదత్ నాయక్(ఫైల్)

మెట్‌పల్లి ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్

జగిత్యాలరూరల్, ఆగస్టు 11: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ముందు మహిళను లాఠీతో కొట్టిన వ్యవహారంలో మెట్‌పల్లి ఏఎస్సై అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌ను జిల్లా హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో దంపతులు గొడవ పడుతున్న క్రమంలో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్ మహిళపై దురుసుగా ప్రవర్తించి, లాఠీతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎస్పీ అశోక్‌కుమార్ ఇద్దరిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/బోయినపల్లి/ఇల్లంతకుంట, జూలై11: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది రిజర్వాయర్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఎల్లంపల్లి నుంచి ఒక పంప్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రీ పంప్ హౌస్‌లోకి తరలిస్తున్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రీ పంప్‌హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 313.18 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.74 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 నీటిని తరలిస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.16టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను ఆదివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 2,750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,583 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,583 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కొత్తపల్లి రిజిస్ట్రేషన్లను కరీంనగర్ కార్యాలయానికి మార్చాలి

భగత్‌నగర్, ఆగస్టు 11: కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల రిజస్ట్రేషన్లు కరీంనగర్ కార్యాలయానికి మార్చాలని కొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. కొత్తపల్లి మండల పరిధిలోని పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, కమాన్‌పూర్, బద్దిపల్లి, ఆసిఫ్‌నగర్, నాగులమల్యాల, ఖాజీపూర్, ఎలగందల్, కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రిజిస్ట్రేషన్లు దూరంలో ఉన్న గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతుండంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి కరీంనగర్‌లో రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ మడుపు మోహన్, మాజీ సర్పంచులు, గడ్డం శ్రీరాములు, బొమ్మ ఈశ్వర్‌గౌడ్, బోనాలమురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 11: మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ నేతలు అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం అనేక మంది మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని, వారి త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. ఆదివారం హర్ ఘర్‌కు తిరంగా అభియాన్ కార్యక్ర మంలో భాగంగా భగత్‌సింగ్, పొట్టి శ్రీరాములు విగ్రహాలను శుద్ధి చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించారు. కార్పొరేటర్ దుర్శెట్టి అనూప్‌కుమార్, మాజీ మేయర్ డి.శంకర్, బీజేపీ సీనియర్‌నాయకుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు కన్న కృష్ణ, నాయకులు వంగల పవన్‌కుమార్, సాయి, కళికోట మోహన్ పాల్గొన్నారు.

●భగత్‌నగర్, ఆగస్టు 11: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల ఫలితమే భారత దేశ స్వాతంత్య్రమని బీజేపీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కొలగాని శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను శుద్ధి చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జెల్లోజి చిట్టిబాబు, కొమ్మెరి రవీందర్‌రెడ్డి, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ, చిగిరి రవీందర్, చాడ ఆనంద్, బోయిని శ్రీనివాస్, ఎన్నం శ్రీనివాస్, బండారి అంజి, ఈసంపల్లి మహేష్, బత్తిని మహేష్‌గౌడ్, నరహరి లక్ష్మారెడ్డి, పసుల విజయ్, వెంకట్, ఇసంపెల్లి మహేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

భజన పాటల పుస్తకం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు11: నీలకంఠ భజన మండలి కరీంనగర్ గణేష్ నగర్ వారి భక్తి గీతాల గానలహరి భజన పాటల పుస్తకం, భజన మండలి పాట ఆవిష్క రణ కార్యక్రమం ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాని ఈవెంట్స్ డోలక్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, భజన కార్యక్రమాలు అందరిని ఆకట్టు కున్నాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేపట్టి చిన్నపిల్లలతో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం, భజన మండలి పాట ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ నీలకంఠ భజన మండలి గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, శ్రీ నీలకంఠ భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షులు పంజాల శ్రీధర్ గౌడ్, డోలక్ రాజు, శ్రీ నీలకంఠ భజన మండలి సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భజన భక్తులు, కవులు, కళాకారులు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత

కమాన్‌పూర్, ఆగస్టు 11 : మండల కేంద్రానికి చెందిన వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షులు వైద్యుల మధుకర్ ఆదివారం తార ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నల్ల వజ్రం కీర్తి పురస్కారాన్ని ఏసీపీ ప్రతాప్, సంస్థ అధ్యక్షులు సంఖ్య రాజేష్ శ్రీధర్‌యాదవ్ మ్యాజిక్ రాజా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డును అందుకోవడం పట్ల వసుంధర సంస్థ గౌరవ సలహాదారులు మండల రవీందర్‌రెడ్డి, అధ్యక్షులు చదువు వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

-పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు -పట్టించుకోని అధికారులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 11: మండలంలోని ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణాల్లో మైదానం ఏర్పాటు చేయడం, ఆటలకు ఉపయోగపడే పరికరాలను ఏర్పాటు చేసినప్పటికీ ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రతి గ్రామానికి క్రీడలకు సంబంధించిన కిట్లు కూడా గ్రామ పంచాయతీలకు అందజేసినప్పటికీ వాటిని ఉపయోగించకుండానే మూలనపడి ఉన్నాయి. అయితే కరీంనగర్ మండలంలో 17 గ్రామాలు ఉండగా 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నిధులను మంజూరు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆస్థలంలో క్రీడలకు సంబంధించిన పరికరాలను ప్రభుత్వం అందజేసింది. అధికారులు క్రీడా మైదానంపై అవగాహన పెంపొందించక పోవడంతో క్రీడా మైదానాలు కాస్తా నిరుపయోగంగా మారుతున్నాయి. ఉపాధిహామీ పథకం కింద పనులను చేపట్టి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పజెప్పారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహణ సరిగా లేకపోవడంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారుతున్నాయి.



దుర్శేడ్‌లోని క్రీడా ప్రాంగణం



నిరుపయోగంగా డబుల్ బార్ పోల్స్

లక్షల రూపాయలను వెచ్చించి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినప్పటికీ గ్రామీణ ప్రాంతాల యువత వాటిని ఉపయోగిం చుకోలేకపోతున్నారు. మైదానాల్లో చదును చేసి క్రీడలకు సంబంధించి ఫుట్ బాల్‌కు సంబంధించిన పోల్స్, డబుల్ బార్ పోల్స్ ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో ఓపెన్‌జిమ్‌లకు నిధులు కూడా మంజూరయ్యాయి. దుర్శేడ్ గ్రామంలో ఉన్న క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. సర్పంచ్‌లు పాలనలో గ్రామ పంచాయతీ నిధులతో మైదానాల చదును చేయడం మొక్కలు తొలగించడం వంటి పనులు చేపట్టే వారు. గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామీణ యువతకు, గ్రామస్తుల సౌకర్యార్థం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని, గ్రామ పంచాయతీల్లో ఉన్న స్పోర్ట్స్ కిట్స్‌లను యువకులకు అందజేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

కరీంనగర్ క్రైం, ఆగస్టు11: కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలో యువకుడిపై కత్తితో దాడి జరిగిందని మూడో టౌన్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కరీంనగర్ తిలక్‌రోడ్ ప్రాంతానికి చెందిన చింతల సాయిరాం ఆదివారం సాయంత్రం హౌజింగ్ బోర్డు కాలనీలోని తన బంధువుల ఇంట్లో బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్లాడు. అక్కడి ఎదుటి ఇంటి భవనంపై ఉన్న చిన్నారులను సాయిరాం దూషించినట్లుగా అర్థం చేసుకున్న చిన్నారుల కుటుంబ సభ్యులు, బంధువులు ప్రశాంత్, రాజేశ్, నిఖిల్‌లు కలిసి సాయిరాంపై అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ క్రమంలో ప్రశాంత్ అతని వెంట తెచ్చుకున్న కత్తితో సాయిరాంపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వెంటనే సాయిరాంను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్మీజవాన్లు దేశానికి నిజమైన హీరోలు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

భగత్‌నగర్, ఆగస్టు 11: ఆర్మీ జవాన్లే దేశానికి నిజమైన హీరోలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం డిల్లీ డిఫెన్స్ అకాడమి, జూనియర్ కళాశాల ఫ్రెషర్ డే వేడుకలు రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అగ్నిపథ్ అనే గొప్పపథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. అగ్నివీరులుగా గుర్తించి నాలుగేళ్లపాటు శిక్షణ అందిస్తున్నారన్నారు. కార్పస్‌ఫండ్ పేరుతో 11 లక్షల రూపాయలను కేంద్రం అందిస్తుందన్నారు. భవిష్యత్తులో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పది శాతం రిజర్వేషన్ కోటాను ప్రకటించిందన్నారు. నాలుగేళ్ల పాటు ఉద్యోగం చేసే సమయంలో ఏదైనా జరిగితే 48 లక్షల రూపాయల ఇన్సురెన్స్‌తో పాటు ఎక్స్‌గ్రేషియా కూడా అందిస్తుందన్నారు. ఎంతో దూరదృష్టితో పథకాన్ని ప్రవేశపెడితే కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యునిస్టులు విషం చిమ్మారని బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఏడు సంవత్సరాల్లో డిల్లీ డిఫెన్స్ నుంచి 2 వేల మంది విద్యార్థులు ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. ఈ కార్యక్రమంలో డిల్లీ డిఫెన్స్ అకాడమి ఛైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, కొలగాని శ్రీనివాస్, రాపర్తి విజయ, నాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసరస్వతి శిశుమందిర్‌కు రూ.లక్ష విరాళం



లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందిస్తున్న రిటైర్డ్ టీచర్ పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 11: నగరంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాల అభివృద్ధి కోసం రిటైర్డు టీచర్, పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ లక్ష నూట పదహారు రూపాయలను విరాళంగా అందజేశారు. ఆదివారం పాఠశాల ఆవరణలో బిల్డర్స్, ఇంజనీర్స్ గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50మంది ఇంజనీర్లు, బిల్డర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా విద్యాభారతి అఖిల భారతీయ ప్రచార ప్రభారే, దక్షిణ మధ్య క్షేత్ర ది సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. అనేక సమస్యలకు పరిష్కారం మన పూర్వీకులు సూచించారని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం లక్ష నూట పదహారు రూపాయల చెక్కును పాఠశాల సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బల్మూరి కరుణాకర్‌రావు, ఇంజనీర్ కోల అన్నారెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో జేష్ఠ కార్యకర్త పాక రాజమౌళి, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

భగత్‌నగర్, ఆగస్టు 11: లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్ అన్నారు. రేకుర్తిలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల ముహూర్తాన్ని ఆదివారం ఖరారు చేశారు. గంగుల కమలాకర్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 17న ఉదయం 8గంటలకు స్వయంభుగా వెలిసిన రేకుర్తి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం నిర్వహించేందుకు ముహూర్తాన్ని వేద పండి తులు నిర్ణయించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ సహకా రంతో ఆలయ అభివృద్ధికి రూపకల్పన చేశామన్నారు. ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించడం పట్ల రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు రాజశేఖర్, సుదగోని మాధవికృష్ణగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేలో జిల్లా విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్, ఆగస్టు 11: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన ఏడుగురు విద్యార్థులు బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారని కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్ జి.సతీష్ తెలిపారు. డ్రాగన్ కుంగ్‌ఫూ మార్షల్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ సమురాయ్ ఫెడరేషన్ చీఫ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ క్యోషి భీమా ఉదయ్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పలు దేశాలకు చెందిన 1200 మంది పాల్గొన్నారన్నారు. ఇందులో పెద్దపల్లి జిల్లాకు చెందిన కురిమిల్ల రిత్విక్, జక్కుల హర్షిత్, సయ్యద్ ఆఫాన్, సమన్వయ, హర్షవర్ధన్, అబినయలు గోల్డ్ మెడల్ సాధించారు. వీరిలో నలుగురు బంగారు, ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన వారిని సత్కరించారు.

ఇసుక డంప్ సీజ్

సుల్తానాబాద్, ఆగస్టు 11: సుల్తానాబాద్ మండలంలోని కొమండ్లపల్లి గ్రామంలో ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల మానేరు వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించి డంప్‌లు ఏర్పాటు చేసి గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో హైదరాబాద్ వంటి నగరాలకు లారీల ద్వారా తరలిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో శనివారం ట్రాక్టర్లతో 'తీసుకువచ్చి.. లారీల్లో నింపుతూ' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు మండలంలోని అక్రమ ఇసుక డంపుల కోసం అన్వేషించారు. కొమండ్లపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న డంప్‌ను అధికారులు గుర్తించి దాన్ని సీజ్ చేశారు. వారం రోజుల వ్యవధిలో రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేయగా, అక్రమంగా ఈ డంప్‌ల నుంచి ఇసుకను హైదరాబాద్ కు తరలిస్తున్న రెండు లారీలను, లారీలలో ఇసును నింపే వాహనాన్ని సీజ్ చేశారు. ఇటీవల కాలంలో సుల్తానాబాద్ ప్రాంతంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుంది.

సామాజిక సేవకుడు సదయ్యకు సన్మానం

సుల్తానాబాద్, ఆగస్టు 11: భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుల్తానాబాద్‌కు చెందిన ఏగోలపు సదయ్యగౌడ్‌ను ఆదివారం వేములవాడ భవన నిర్మాణ కార్మికులు ఘనంగా సన్మానించారు. 20ఏళ్ల నుంచి సదయ్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సేవలను పరిగణనలోకి తీసుకున్న వేములవాడ భవన నిర్మాణ కార్మికులు ఆదివారం వేములవాడలో సన్మానం చేశారు. పెయింటర్‌గా జీవితం ప్రారంభించి సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి ఖర్చు చేయడం ఎంతో తృప్తినిచ్చిందని సదయ్య అన్నారు.

కొనసాగుతున్న ఆలయ సుందరీకరణ పనులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 11: మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం 40 లక్షల నిధులు కేటాయించగా దాత రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రహరీ, గోపురంతో పాటు ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ఈవో శంకర్ పనులను పరిశీలించారు. వచ్చే జాతర వరకు పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.

బీరన్న ఆలయానికి శంకుస్థాపన

ఓదెల, ఆగస్టు 11: మండలంలోని అబ్బిడిపల్లిలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీరన్న ఆలయానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్‌రెడ్డి మాట్లాడుతూ కురుమ కులస్తులకు ఆరాధ్య దైవమైన బీరన్న వేడుకలకు అనుకూలంగా ఈ ఆలయాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆశీస్సులతో నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, ఆలయ నిర్మాణానికి భూమి దాత జింకిరి రవీందర్, మాజీ సర్పంచ్ పడాల రాజు, బోడకుంట శంకర్, పుప్పాల శంకర్‌తో పాటు రాపర్తి మల్లేశం, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, మాజీ సర్పంచ్ గోవింద ఎల్ల స్వామి వేరువేరుగా పాల్గొన్నారు.

మందకృష్ణకు ఘన స్వాగతం పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11: మూడు దశాబ్దాల నిర్విరామ త్యాగపూరిత పోరాటాల ద్వారా మాదిగ జాతికి విజయం అందించి ఢిల్లీ నుంచి మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు లక్ష డప్పులతో స్వాగతం పలకాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేష్ మాదిగ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యావత్ మాదిగ జాతి ఈనెల 13న చేరుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు అంబాల నరేష్ మాదిగ, తాండ్ర శీను మాదిగ, రామస్వామి మాదిగ, కలువల మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

జూలపల్లి, ఆగస్టు 11: జూలపల్లి స్టేట్ హైవే సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సాధన సమితి కన్వీనర్ మారం తిరుపతియాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జూలపల్లి మండల కేంద్రంలోని రోడ్డును స్టేట్ హైవేగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన ఈసందర్భంగా డిమాండ్ చేశారు. గతంలో డబుల్‌రోడ్డు మంజూరు కోసం జిల్లా కేంద్రం వరకు చేపట్టిన పాదయాత్రతో ప్రభుత్వం డబుల్ రోడ్డును మంజూరు చేసిందని ఆయన గుర్తుచేశారు. స్టేట్ హైవే సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

బస్టాప్‌లో వృద్ధుడి మృతదేహం

జ్యోతినగర్, ఆగస్టు 11: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ పాత బస్టాప్‌లో 65 సంవత్సరాల వృద్ధుడి మృతదేహాన్ని ఆదివారం రాత్రి పోలీసులు గుర్తించారు. గోధుమ రంగు లైన్ టీ షర్టు ధరించి ఉన్నాడు. స్థానికంగా విచారిస్తే రాములుగౌడ్ అని తెలిసిందని ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. వృద్ధుడి గురించి సమాచారం తెలిస్తే 8712656526 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

భగత్‌నగర్, ఆగస్టు 11: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని బీజేపీ దళి మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మండల ఇన్‌ఛార్జి జాడి బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు కరీం నగర్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, వేముల అనిల్, కోమటిరెడ్డి అంజనికుమార్, కుంటి తిరుపతి, శక్తికేంద్ర ఇన్‌ఛార్జి జిట్టవేణి రుణు, మెరుగుపరుశురాం, ప్రశాంత్, సోమినేని కరుణాకర్, కడారి శ్రీనివాస్, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన మంత్రి పొన్నం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 11: హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించి 52 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించిన కరీంనగర్‌కు చెందిన తుడి సిరిచందనను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

సామాజిక చైతన్యం రగిలించిన వీర వనిత చాకలి అయిలమ్మ

- రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్ శంకర్

గంభీరావుపేట, ఆగస్టు 11: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన వారిలో సామాజిక చైతన్యం రగిలించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు బసవరాజ్ శంకర్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో చిట్యాల చాకలి అయిలమ్మ విగ్రహాన్ని ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, ముని మనవరాలు శ్వేత, ముని మనవడు సంపత్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల భూమయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు మాట్లాడారు. చాకలి అయిలమ్మ పోరాట పటిమను యావత్తు తెలంగాణ ప్రజలు మరువలేరని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు బసవరాజ్ శంకర్ అన్నారు. ఐలమ్మ పోరాట ఫలితంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉద్భవించి నిజాం నిరంకుశ పాలను దహించివేసిందన్నారు. నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో తెలంగాణ చరిత్ర తిరగరాసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల భూమయ్య, రజక సంఘం ఓయూ జేఏసీ చైర్‌పర్సన్ గంపల శ్రీనివాస్, నాయకుడు శ్రీధర్ ఉన్నారు.

మరమ్మతుకు నోచుకోని తుమ్మలమాటు కట్ట

●పట్టించుకోని అధికారులు ●ఇబ్బందులు ఎదుర్కొంటున్నరైతులు



మట్టి కొట్టుకుపోయిన తుమ్మలమాటు కట్ట

కొడిమ్యాల, ఆగస్టు 11 : మండలంలోని అప్పారావుపేట గ్రామ శివారులోని తుమ్మ లమాటు(తాతమ్మ మాటు) మట్టి కట్ట గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయింది. సుమారు 30 ఏళ్ల క్రితం అప్పటి నీటి పారుదల శాఖ అధికారులు నిర్మిం చిన తుమ్మల మాటు మాత్రం పటిష్టంగా ఉంది. మాటుకు ఎడమ వైపు ఉన్న మట్టి కట్ట కొట్టుకుపోవటంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా కట్ట సమీపంలోని భూముల్లో పంటలు పండించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మల మాటు నుంచి లింక్ కెనాల్ ద్వారా నీరు పూడూర్ తుమ్మల కుంట కు, అక్కడ నుంచి మండలంలోని నమిలికొండ జాఫర్‌ఖాన్ చెరువులోకి వెలుతుంది. ఏడాది కాలంగా తుమ్మలకుంటకు, జాఫర్‌ఖాన్ చెరువు తుమ్మల మాటు నుంచి నీరు వెళ్లక పోవటంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్ట మరమ్మతును సంబంధిత అధికారులు పట్టిం చుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధి కారులు పట్టించుకొని తుమ్మలమాటు కట్ట మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



మట్టికట్టను పటిష్టంగా నిర్మించాలి

వెల్ముల రాంరెడ్డి(మాజీ సర్పంచు-పూడూర్)

తుమ్మలకుంట మాటుకు తెగిపోయిన మట్టి కట్టను సంబంధిత అధికారులు పటిష్టంగా నిర్మించాలి. తుమ్మలకుంట మాటు కట్ట ని ర్మాణం చేసినట్లయితే పడమటి వైపు అర కిలో మీటరు దూరం తాత మ్మ దేవాలయం వరకు బ్యాక్ వాటర్ నిలుస్తుంది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. నాచుపల్లి, అప్పారావుపేట గ్రామాల రైతులకు ఎంతగానో ఉపయో గంగా ఉంటుంది.



అంచనాలు పంపించాం

రాజేష్‌ఖన్నా, ఇరిగేషన్ ఏఈ-కొడిమ్యాల

తుమ్మలమాటు కట్ట నిర్మాణం కోసం 40లక్షల రూపాయల అంచనాలను ప్రభుత్వానికి ఇప్పటికే పంపించాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కట్ట పనులను చేపట్టుతాం.

ధరణితో రైతులు, ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు

● నూతన ఆర్వోఆర్ చట్టంతో సమస్యలన్నింటికి పరిష్కారం చూపాలి

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ● ట్రెసా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

కరీంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నూతన ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిం చారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా బిల్లుపై వివిధ వర్గాల తో చర్చించాలన్నారు. ప్రజలకు పట్టాదారులకు రైతులకు మరింత మేలు జరిగే విధంగా చట్టం రూపకల్పనలో సహకరించాలని సూచిం చారు. కొత్త రెవెన్యూ చట్టం ఈ సమస్యలన్నింటికీ పరిష్కా రం చూపే విధంగా ఉండాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి కళ్లు, చెవుల లాంటి వారని, గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరిచి ఒక మంచి చట్టం ద్వారా తెలంగాణ ప్రజలకు మేలైన సర్వీసులు అందిస్తామని తెలియజేశారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడారు. కార్య క్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోల్కొండ సతీష్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ట్రెసా రాష్ట్ర కమిటీ సభ్యులు రి యాజ్, నిరంజన్, చైతన్య, రమన్ రెడ్డి, వకీల్, కిషన్ పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి

వేములవాడ టౌన్, ఆగస్టు 11: ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్ట ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రుద్రవరం, ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాలకు చెందిన నిర్వసితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాగా ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. అర్హులైన నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య మాట్లాడుతూ మధ్యమానేరు జలాశాయంలో ముంపు గురైన గ్రామాల నిర్వసితులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. తమ పాత గ్రామంలోని సబ్‌స్టేషన్ మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిందన్నారు. ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని సబ్‌స్టేషన్ మంజూరు చేసి తమ సమస్యను పరిష్కారించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి రవీందర్, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, కత్తి కనుకయ్య, రగుడు పర్శరాములు, ఇటీక్యాల రాజు, ఎర్రం ఆగయ్య, బోనాల రమేష్, సిలివేని మల్లేశం ఉన్నారు.

● ప్రభుత్వ విప్‌ను కలిసిన మై విలేజ్‌షో సభ్యులు..

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మై విలేజ్ షో టీం సభ్యులు ఆదివారం కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన మై విలేజ్ షో టీం సభ్యులు ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గంగవ్వ, బుర్ర శివకృష్ణ, గీల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

చందుర్తి: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఎన్గల్, మల్యాల గ్రామాల్లో మెరుపుల లచ్చయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 13 వేల రూపాయలు, సర్వాయి లింగవ్వకు 51 వేల రూపాయలు, నేరళ్ల అక్షయకు 26 వేల రూపాయల విలువైన చెక్కులను ఆదివారం అందజేశారు.